# ప్రశ్నలు & సమాధానాలు
# ప్రశ్న 327: మన జీవితంలో దైవానుగ్రహం యక్క ప్రభావం
# జులై 6, 2024

ఈ ప్రశ్న-సమాధానాలు ప్రొ. అనిల్ కుమార్ గారి సత్యోపనిషద్, సంపుటం 1, పేజీలు 23-29 నుండి తీసికొనబడినవి

స్వామి! దైవానుగ్రహం లభించాలంటే ఏమి చేయాలి?

భగవాన్: భక్తి తప్ప ఇంకొక మార్గం లేదు. మీ ధనము, పాండిత్యము, బలము, రూపము భగవంతుడిని మెప్పించలేవు. భక్తి మాత్రమే చూస్తాడు.

రామాయణంలో గుహుడు తెలుసు కదా? అతనికి ఏమి పాండిత్యం ఉంది రాముని మెప్పించడానికి? ఏమి లేదు. అతనికి చదువు కూడా రాదు. మీరు శబరి గురించి విసే ఉంటారు. రామునికి దగ్గరవడానికి ఆమెకి ఎంత ధనముంది? ఏమి లేదు. చిరుగు బట్టలలో ఉంది ఆమె. నిరుపేదలలో నిరుపేద. జటాయువు రాముని ప్రత్యేక అనుగ్రహం లభించి, రాముని దివ్య హస్తాలతో అంత్యక్రియలు చేయించుకొనే భాగ్యం లభించడానికి ఏమి చేసాడు? రాముని తండ్రి దశరథునికి కూడా జటాయువుకి దొరికినంత భాగ్యం దొరకలేదు. రాముడు అరణ్యంలో ఉన్నప్పుడే అయోధ్యలో దూరంగా మరణించాడు. ఒక కోతి అయిన హనుమంతుడు రామునిపై పూర్తి నమ్మకము, సంపూర్ణ పరిత్యాగ భావము ఉండబట్టే అతనికిచ్చిన పనిలో జయం సాధించడమే కాకుండా రాముని భక్తుల పూజలు కూడా అందుకున్నాడు. రామావతారం సమయం నుండి ఇప్పటి వరకూ ఆ పూజలు జరుగుతూనే ఉన్నాయి.

మహాభారతంలో పాండవుల రాణి ద్రౌపది, జయాపజయములలో, కష్టసుఖాలలో, శాంతి అశాంతులలో, ఎల్లప్పుడూ, అన్ని చోట్లలో, హస్తినాపురంలోని సింహాసనం మీద ఉన్నప్పుడు, మరి అరణ్యంలో ఉన్నప్పుడూ కృష్ణునికి గొప్ప భక్తురాలుగా నిరూపించుకుంది. పాండవులకి కృష్ణునిపై గాఢ భక్తి, ఎనలేని ప్రేమ. స్థితప్రజ్ఞులుగా, సర్వసంగ పరిత్యాగులుగా గొప్ప ఉదాహరణలు. ఎంత వరకు అంటే ధర్మజుడు తన తల అని, అర్జునుడు తన హృదయమని, భీముడు తన భుజములని, నకులసహదేవులు తన రెండు పాదాలని కృష్ణుడు చెప్పుకున్నాడు. ఇదే భక్తుని ఆదర్శ స్థాయి.

భాగవతంలో గోపికలు వారి మధురభక్తికి, సంపూర్ణ దైవానురాగానికి, అపారమైన ప్రేమ, పరిత్యాగానికి పేరు. వారి భక్తి ఉత్తమమైనది, పవిత్రమైనది, మధురమైనది, శ్రేష్టమైనది. వారు పొదలలో, కంచెలలో, ఆకులలో, పూవులలో కూడా కృష్ణుడిని చూసారు. ఇది తదాత్మ్యభావం కాదా? వారిది అద్వైతభావం కాదా? వారు క్షణమైనను కృష్ణుని నుండి దూరం భరించగలిగే వారు కాదు. ఇదీ వారి భక్తి యొక్క స్థాయి.

మీరు కీర్తనలు వ్రాసి పాడే త్యాగరాజు గురించి వినలేదా? అతను 'నిధి చాల సుఖమా? రాముని సన్నిధి సేవ సుఖమా?' అని ప్రశ్న వేసాడు. రామదాసు, సూరదాసు, కబీరు, తులసీదాసు, జయదేవ, తుకారాం, మీరా, వీరందరూ భక్తికి మూర్తీభవించిన వారు. అందుకనే ఈనాటికి కూడా వారిని తలచుకుంటున్నాము. వారి గురించి చదివితే, మీకు భగవదనుగ్రహం లభించడమే కాక భగవదనుగ్రహం పొందే హక్కు కలవారౌతారు. మీరు పెళ్లి చేసుకున్న వెంటనే మీ భార్యకి మీ ఆస్తిపై హక్కు ఉంటుంది. పెళ్ళి ముహూర్తంలో ఆ మంగళసూత్రం

కట్టడం వల్లనే ఈ హక్కు. అదే విధంగా భక్తి అనేది భక్తుడు దైవానుగ్రహం లభ్యమయ్యే హక్కునిచ్చే భక్తిసూత్రం. కనుక అన్నిటికీ భక్తి ముఖ్యం. చాలా మందికి భక్తి దైవత్వం పొందడానికి సరి అయిన, ఉత్తమమైన మార్గం.

స్వామి**!** మేము దైవానుగ్రహం ఎందుకు పొందలేదు**?**

భగవాన్**:** అలా అనుకోవడం పొరపాటు. మీరు అలా భావిస్తే అది తప్పు. దైవానుగ్రహం అందరికీ సమంగా లభిస్తుంది. భగవంతునికి కులం, వర్ణం, లింగం, జాతి వంటి భేదాలు ఉండవు. పొరపాటు ఉంటే మీలోనే ఉందని తెలుసుకోవాలి. మీ హృదయమనే పాత్రను పరిశుద్ధం చేసుకోవాలి. ఉదాహరణకి, ఇప్పుడు బాగా వర్షం పడుతోంది. మీరు ఒక పాత్రలో నీరు పట్టుకోవాలంటే దానిని పైకి పెట్టాలి. కానీ దానిని పక్కకి తిప్పినా, కిందకి బోర్లించినా, నీరు పట్టాగలమా? ఎంత వర్షం పడినా ఏమి లాభం లేదు. కనుక మన హృదయాలను ఎల్లప్పుడూ పరిశుద్ధంగా ఉంచుకుంటే దైవానుగ్రహం అనే వర్షం అందుకోవచ్చు. భగవంతుని ప్రేమ అందుకోవడానికి మనం అంతరంగంలోనికి  తిప్పుకోవాలి, కదా?

స్వామి**!** మా అదృష్టం చెప్పనలివి కానిది**.** ఎంతమందికి దొరుకుతుంది ఈ భాగ్యం**?** ఇదంతా మీ అనుగ్రహం**.** కానీ ఇది నిలుపుకోనేది ఎలా**?**

భగవాన్**:** చూడండి, కోట్లాది ప్రజలలో ఇక్కడ ఎంత మంది ఉండ గలుగుతున్నారు? ఈ సామీప్యం అందరికీ సాధ్యమౌతుందా? మీ పూర్వ జన్మ పుణ్యం వల్ల మీరు ఇక్కడ ఉండగల భాగ్యం ఉంది మీకు. మన institutionsలో ఉండే వేల మందిలో ఎంత మంది విద్యార్థులు ఇక్కడకు రాగలిగారు? మీలో కొంత మందే నాతో కోడైకనాల్ రాగలిగారు. ఇది మీరు భద్రంగా కాపాడుకోవాలి.

ఒక చిన్న ఉదాహరణ: ఇది ఒక దారపు చుట్ట. దీని చుట్టూ దారం ఎన్నో సార్లు చుట్టబడింది. ఇది చుట్టడానికి ఎంతో కాలం పట్టి ఉంటుంది. కానీ ఎవరైనా దీనిని తొందరలో క్రింద పడవేస్తే దారమంతా ఊడిపోయి క్రింద పడిపోతుంది. అలాగే, మీ అదృష్టం ఈ దారపుటుండ లాగా ఎన్నో జన్మముల పుణ్యంతో కూడినది.

ఈ భాగ్యమును అజాగ్రత్తతో అశ్రద్ధ చేస్తే మళ్ళీ తిరిగి రాదు. మీరు చేసిన శ్రమ అంతా వృధా అయిపోతుంది. ఈ దారపుటుండ మధ్యలో ఉండే రీలు మీ నమ్మకం వంటిది. మీ పుణ్య కార్యములన్నీ దీని చుట్టూ చుట్టబడినవి. కనుక మీ అదృష్ట భాగ్యమును అశ్రద్ధ చేయకండి. అది సాధారణమైనది, సామాన్యమైనది అని భావించకండి. ఆధ్యాత్మిక మార్గమున ఉన్న వారికి అలక్ష్యం, నిర్లక్ష్యం చాలా హానికరం.
స్వామి**,** మీ అనుగ్రహం వల్ల మా ప్రారబ్ధ కర్మ ఎలా ప్రభావం చెందుతుంది**?**

భగవాన్**:** దైవానుగ్రహం, దైవ సంకల్పం దేన్నైనా మార్చివేయ కలుగుతుంది. భగవంతుడనగా ప్రేమ. భగవంతుని అపారమైన కరుణతో నీ ప్రారబ్ధ కర్మ కానీ నీ పూర్వ జన్మముల కర్మ ఫలములు కానీ మార్చివేయగలడు. భక్తుడు తన హృదయమనే జైలులో దేవుని బంధించి వేయగలడు. ఈ లోకంలో భక్తితో సాధించలేనిది ఏదియు లేదు. దైవానుగ్రహంతో నీ పూర్వ జన్మ కర్మ ఫలములు, కర్మ ప్రభావములు చెరిపి వేయవచ్చు. ప్రతికూలమైన దురదృష్టములు ఏవి జరగవు.

ఒక చిన్న ఉదాహరణ: మందుల షాపులో అనేక రకమైన మందులు అమ్మకానికి పెట్టి ఉంటాయి. ప్రతి మందు సీసా పైన ఆ మందు తయారు చేసిన తేది, ఎక్స్పైరీ తేదీ వ్రాసి ఉంటాయి.  ఎక్స్పైరీ తేదీ తర్వాత వాడితే ఆ మందు పని చేసే శక్తి తగ్గిపోతుంది. పనికి రాకుండా పోతుంది. భగవంతుడు కూడా అదే చేస్తాడు. మందు సీసా

మీద ఎక్స్‌పైరీ తేదీ ముద్ర కొట్టినట్లు నీ ప్రారబ్ధ కర్మ రద్దు అయిపోయేటట్లు చేస్తాడు. అంతటితో నీ బాధ, కష్టములు అంతమైపోతాయి. ఈ విధముగా స్వామి, తన అపారమైన దయ, కరుణతో నీ బాధలు తీరుస్తాడు.

స్వామి, ప్రతి రోజూ సాధన చేస్తే భగవంతుని అనుగ్రహం తప్పక దొరుకుతుందా**?**

భగవాన్**:** తప్పకుండా! తప్పకుండా దొరుకుతుంది! సందేహం ఎందుకు? ఉదాహరణకి, నీకొక పెంపుడు కుక్క ఉందనుకో. దానికి రోజూ తిండి పెడితే, రోజూ అదే సమయానికి నీ దగ్గరకు వస్తుంది. ఆ విధంగా క్రమ తప్పకుండా చేసినదానికి నీ కుక్కే క్రమమును అనుసరిస్తే మరి భగవంతుడు ఎందుకు చెయ్యడు? తప్పకుండా అనుగ్రహం దొరుకుతుంది.

స్వామి, మీ అపారమైన కరుణ, అనుగ్రహం వల్ల మేము ఈరోజు ఇక్కడ ఉన్నాము**.** మీ దర్శన, స్పర్శన, సంభాషణ అనే సూర్యకిరణాలలో ఆనందిస్తున్నాము**.** అయినా కూడా పూర్వ జన్మ సుకృతము అవసరమా**?**

భగవాన్**:** ఈ నాటి ఆనందము, పూర్వ జన్మ సుకృతము, రెండూ అవసరమే. రెండిటికీ సంబంధ బాంధవ్యములు ఉంటుంటాయి. ఉదాహరణకి, ఇక్కడ మట్టి ఇసుక మట్టి. వర్షము ఎక్కువగా పడినప్పుడు నీరంతా ఇసుకలోకి ఇంకిపోతాయి. మీలో కూడా ఆ విధముగనే భక్తి స్థిరంగా ఉండదు. కానీ నదిలో వర్షం పడితే నీరు ఎలా ప్రవహిస్తుంది? అంతకు ముందు కంటే ఉధృతంగా ప్రవహిస్తుంది. అదే విధముగా మీరు ఈ ప్రస్తుత్త సమయములో ఇక్కడ నాతో ఉండగలగడము ఆ వర్షము నీరు వంటిది. మీ పూర్వ జన్మ సంస్కారాలు మంచివైతే, నదిలో నీరు వలె మీరు అనుభవించే ఆనందం ఇంకా ఉధృతంగా ప్రవహిస్తుంది.

భగవంతుని అనుగ్రహం వర్షపు నీరు వంటిది. మీ పూర్వ జన్మ పుణ్యం వల్ల దానిని పట్టగలుగుతారు. అందువలననే ఈ అదృష్టము, భాగ్యమును జాగ్రత్తగా కాపాడుకోమని మీతో ఎప్పుడూ చెపుతూ ఉంటాను. ఒక బావిలోనుంచి నీరు తోడాలంటే ఒక బకెట్టుతో లాగి, ఆ నిండు బకెట్టును నువ్వే మొయ్యాలి. కానీ ఆ బకెట్టును మధ్యలో పడేస్తే ఏమౌతుంది? ఆ నీరుని మళ్ళీ అందులో పొయ్యలేవు కదా? కానీ భగవంతుడిని తీవ్రంగా ప్రార్థిస్తే ఏదైనా సాధ్యమౌతుంది. మానవుని ప్రయత్నం పెరిగితే భగవంతుని అనుగ్రహం కూడా అదే రీతిగా ఉంటుంది. అప్పుడే మానవుడు దేన్నైనా సాధించగలడు.

ప్రొ అనిల్ కుమార్ గారు వచ్చే వారం మరిన్ని ముత్యాల వంటి సాయి ఉపదేశాలు మరి కొన్ని చెప్తారు. ధన్యవాదములు.

ఓం సాయి రాం